దూదేకుల విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-కడప అర్బన్

పదవ తరగతి పరీక్షల్లో 550 మార్కులు పైబడి సాధించిన నూర్‌బాషా దూదేకుల పేద విద్యార్థులకు ప్రోత్సాహకం అందించాలని నిర్ణయించినట్లు జిల్లా అధ్యక్షులు రాజకిషోర్ బాబు పేర్కొన్నారు. శనివారం నూర్‌బాషా సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రోత్సాహక బహుమతులు ఎప్పుడు ఇచ్చేది తేదీని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన వారు 9989141475, 9440245717, 9849694733 నంబర్లు సంప్రదించాలని కోరారు. సమావేశంలో దూదేకుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దుపై ప్రభుత్వ వైఖరేంటో తేల్చాల్సిందే

యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల డిమాండ్

మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని, ఇప్పటికైనా సిపిఎస్ రద్దు పట్ల ప్రభుత్వం తమ వైఖరిని తేల్చాల్సిందేనని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. శనివారం యుటిఎఫ్ భవన్లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే వారంలోపే సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామన్న అధికార పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా ఉలుకు పలుకూ లేకుండా ఉందన్నారు. మాట తప్పను, మడమ తిప్పను అని ప్రకటించుకునే ముఖ్యమంత్రి సిపిఎస్ రద్దు విషయంలో మాట తప్పి, మడమ తిప్పి హామీ అమలు నుండి పారిపోయాడని విమర్శించారు. సిపిఎస్ రద్దుపై హామీలు ఇవ్వని అనేక రాష్ట్రాలు సిపిఎస్‌ను రద్దు చేస్తుంటే హామీ ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదన్నారు.సిపిఎస్ రద్దుపై హామీలు ఇచ్చి, అమలు చేస్తున్న అనేక పార్టీలు ఆయా రాష్ట్రాలలో అధికారంలోకి వస్తున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఈ విషయంపై మిగతా రాజకీయ పార్టీలు సైతం తమ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2004లో సిపిఎస్ విధానాన్ని తీసుకొచ్చినప్పుడు వామపక్షాలు తప్ప మిగిలిన రాజకీయ పార్టీలన్నీ అనుకూలంగా ఓటు వేశాయని వారు గుర్తు చేశారు. 2004 నుంచి సిపిఎస్ కు వ్యతిరేకంగా పాత పెన్షన్ విధానం కావాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాలు, ఉద్యమాలు సాగిస్తూనే ఉన్నారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక దాని ఊసెత్తకపోవడం, అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా కాకుండా రాజకీయ పార్టీలు సిపిఎస్ రద్దుపై నిర్దిష్టంగా అభిప్రాయాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సిపిఎస్ రద్దు కోసం పోరాటాలు ఉధృతమైన నేపథ్యంలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తున్నట్లు కొన్ని రాష్ట్రాలు ప్రకటించి, ఉత్తర్వులను విడుదల చేశాయని వారు పేర్కొన్నారు. పాత పెన్షన్ విధానంలోకి వెళ్తే ఎన్ఎస్ఇఎల్‌లోని సొమ్ము తిరిగి రాదని కేంద్ర ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. 2013 లో చట్టం అయిన పిఎఫ్ఆర్డిఎను రద్దు చేయడం ద్వారా మాత్రమే సిపిఎస్ రద్దు సాధ్యమని వారు స్పష్టం చేశారు. పెన్షన్ ఇవ్వడం వల్ల రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి అల్లకల్లోలం అవుతుందనే గ్లోబెల్ ప్రచారంపై విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.కొత్త పెన్షన్ విధానాలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి నష్టమని, కార్పొరేట్లకు మాత్రమే లాభమని గణాంకాలు చెప్తున్నా సిపిఎస్‌ను ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఉద్యోగుల రిటైర్మెంట్ తదుపరి సదుపాయాలు షేర్ మార్కెట్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా చేయడం దుర్మార్గమైన చర్య అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎస్ రద్దు కోసం చేస్తున్న ఉద్యమాలపై ప్రభుత్వం నిర్బంధాలు విధించడం, అక్రమ కేసులు పెట్టడం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వానికున్న వ్యతిరేకతకు నిదర్శనమన్నారు. సిపిఎస్ రద్దయ్యే వరకు, పాత పెన్షన్ విధానం అమలయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం, రాజకీయ పార్టీలన్నీ సిపిఎస్ రద్దుపై తక్షణమే తమ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ ఎస్.దావుద్దీన్, జిల్లా కార్యదర్శి ఎస్.ఎజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ జిల్లా కన్వీనర్ ప్రభాకర్, కడప నగర ప్రధాన కార్యదర్శి కరీముల్లా, జిల్లా కౌన్సిల్ సభ్యులు జి.వెంకటసుబ్బయ్య, సుజిత్, శివశంకర్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

ఇద్దరు చిన్నారులు మృతి - పార్నపల్లెలో విషాద ఛాయలు

ప్రజాశక్తి-లింగాల

సరదా కోసం ఈతకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన అనంతపురం జిల్లా ఎల్లనూరు సింగవరం సమీపంలోని చిత్రావతి రిజర్వాయర్ వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలోని లింగాల మండల పరిధిలోని పార్లపల్లి గ్రామానికి చెందిన షాకే గంగాదేవి, రవీంద్రబాబు కుమారుడు చరణ్ కుమార్ (13), ముక్తాపురం అంజనమ్మ, పేతురు కుమారుడు కుశ్వంత్(8) ఇద్దరు విద్యార్థులు సింగవరం గ్రామంలో బంధువుల గృహప్రవేశానికి తల్లిదండ్రులతో కలిసి వెళ్లారు. చిత్రావతి రిజర్వాయర్ కుడి కాలువ వద్దకు ఈతకు వెళ్లారు. అక్కడ వారికి సరిగ్గా ఈత రాకపోవడంతో ఊపిరాడక అక్కడిక్కడే మృతి చెందారు. ఇద్దరు చిన్నారులు అక్కచెల్లెళ్ల పిల్లలు కావడంతో ఆ కుటుంబం, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహాలను అందజేశారు.

మృతి చెందిన చరణ్‌కుమార్

మృతి చెందిన కుశ్వంత్

18 నుంచి 22 వరకు పోరుబాట

కడప అర్బన్ : బిసిలకు వైసిపి ప్రభుత్వం చేస్తున్న ద్రోహంపై ఈ నెల 18 నుంచి 22 వరకు పోరుబాట నిర్వహిస్తున్నట్లు టిడిపి యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షులు సుబ్బరాయుడు యాదవ్ తెలిపారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందఠరేగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాలుగున్నర సంవత్సరాల పాలనలో అత్యంత తీవ్రంగా నష్టపోయి దగాకు గురైంది బిసిలేనన్నారు. సమావేశంలో యాదవ సాధికార కమిటీ సభ్యులు నూకనబోయిన నరసింహాయాదవ్, సభ్యులు శ్రీను యాదవ్, పార్వతి యాదవ్, కిరణ్, నరసింహులు యాదవ్, భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

కార్మిక వర్గాన్ని చైతన్య వంతం చేయాలి

కడప అర్బన్: కార్మిక వర్గాన్ని చైతన్యవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి పిలుపునిచ్చారు. శనివార విజయవాలో జరుగతున్న సిఐటియు సమావేశాల నేపథ్యంలో సిఐటియు జిల్లా నివేదికపై ప్రసంగించారు. జిల్లాలో కనీస వేతనం రూ.26 వేల కోసం పోరాటాలకు కార్మికులు ఎన్నో త్యాగాలతో సాధించుకున్న హక్కును పరిరక్షించుకునేందుకు సంఘటిత పోరాటాలకు సన్నద్ధం చేయాలని కోరారు. జిల్లాలోని అసంఘటిత రంగంలోని కార్మికులకు పభుత్వ రంగంలో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లకు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీసవేతనాలు అందడం లేదన్నారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి బి.లక్ష్మిదేవి పాల్గొన్నారు.

డిఎస్‌పిని కలిసిన పాస్టర్ మహేష్

కడప: కడప డిఎస్‌పి ఎండి షరీఫ్‌ను శనివారం న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. షరీఫ్‌కు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో పి.రవితేజ, జి.నిఖిల్, అగస్టీన్, రోజా, శాంతిరాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డిఎస్‌పితో పాస్టర్ మహేష్

అమ్మను మించిన దైవం లేదు

కడప: అమ్మను మించిన దైవం లేదని వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ పేర్కొన్నారు.మదర్స్ డే సందర్భంగా మదర్‌థెరిసా పోస్టర్‌ను శనివారం ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో కరీముల్లా, ఆరిఫ్ ఖాన్, మొహిద్దిన్ ఖాన్, యువత సభ్యులు హర్షవర్ధన్‌రెడ్డి, బాలిరెడ్డి, శెట్టికుమార్ పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు అండగా ఉంటాం

కడప: పదవ తరగతి ఫలితాల్లో వికాస్ హైస్కూల్ విద్యార్థిని బి.లక్ష్మి చేతన 600 మార్కులకు 596 మార్కులు సాధించి రాష్ట్రంలో రెండవ ర్యాంక్, జిల్లాలో మొదటి ర్యాంక్ దక్కించుకున్న సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయనను వికాస్ స్కూల్ కరెస్పాండెంట్ హరికృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు చదివేందుకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

చేతనను అభినందిస్తున్న చంద్రబాబు

జగన్‌ను విమర్శించే స్థాయి పవన్‌కు లేదు

కడప: పవన్ కళ్యాణ్‌కి ప్యాకేజీ ఇంకా ఎంత అనేది క్లారిటీ వచ్చినట్లు లేదని, ఆయన తీరు జనసేన కార్యకర్తలను అయోమయానికి గురి చేస్తుందని చింత కొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. శనివారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌పై మండిపడ్డారు. రోజుకో మాట, గంటకో మాట, నిమిషానికి ఒకలా పవన్ కళ్యాణ్ ప్రవర్తిస్తున్నాడన్నారు. ముఖ్యమంత్రి జగన్‌ను విమర్శించే స్థాయి పవన్ కల్యాణ్‌కు లేదని చెప్పారు.

104 సేవలు అభినందనీయం

వల్లూరు: ప్రతి గ్రామానికి తిరుగుతూ 104 వాహనం ద్వారా ప్రజలకు సేవలు అందించడం చాలా అభినందనీయమని జిల్లా వైద్యశాఖ అధికారి ఖాదర్ వల్లి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని చిన్న లేబాక గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ 104 కార్యక్రమాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలను రక్తహీనతపై గ్రామంలో చర్చించారు. గ్రామంలో మంచాన ఉన్న రోగులను గురించి వారి సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుమారునిపల్లెలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సందర్శించి తగు సూచనలు అందించారు. కార్యక్రమంలో వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఫణింద్ర, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

పెండింగ్ గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి : ఎంపిపి

చెన్నూరు: సొంత స్థలాలలో నిర్మిస్తున్న వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, తహశీల్దార్ పటాన్ అలీ ఖాన్ తెలిపారు. శనివారం చెన్నూరులోని, అరుంధతి నగర్, గాంధీనగర్‌లలో పర్యటించి అక్కడి గృహ నిర్మాణ లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత స్థలాలలో గృహ నిర్మాణం చేపట్టిన గృహ లబ్ధిదారులు 370 మంది ఉన్నారని అయితే అందులో 300 గృహాలు పూర్తి అయ్యాయన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ మేనిల్, పిఆర్ ఎఇ మురళి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుజిత పాల్గొన్నారు.

ఇంటిని పరిశీలిస్తున్న ఎంపిపి సురేష్

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

పోరుమామిళ్ల టౌన్: విద్యార్థులు చదువుతో పాటు వినయ విధేయతలు, పెద్దల పట్ల గౌరవం అలవాటు చేసుకోవాలని డాక్టర్ మార్కారెడ్డి అన్నారు. గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం పోరుమామిళ్లలో గ్రంథాలయాధికారి ఆఫ్రిది ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపును ఆయన సందర్శించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు ఖాసింవల్లి మాట్లాడుతూ ఆదివారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత,ఉపాధ్యాయులు దాదాపీర్, పాఠకులు ఖదీర్ భాష, ఖాజావలి, తెలుగు అధ్యాపకులు మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమంలో అన్నదానం

కాశినాయన: పట్టణానికి చెందిన ఫణి ప్రసాద్ సతీమణి సుబ్బలక్ష్మమ్మ రెండవ వర్ధంతి సందర్భంగా ఓబుళపురం సగిలేరు ఒడ్డునన్న స్వామి వివేకానంద అనాథ ఆశ్రమంలో అన్నదాన నిర్వహించారు. పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆమె చెల్లెలు కుమారుడు రవికుమార్ పాల్గొన్నారు.

అన్నం వడ్డిస్తున్న ఫణిప్రసాద్

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

పోరుమామిళ్ల టౌన్: పోరుమామిళ్లలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ప్రభుత్వ సలహాదారుడు పి.నాగార్జునరెడ్డి స్వగృహంలో ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నీటి సంఘం ప్రెసిడెంట్ ఓబన్న, కోటా ప్రసాద్, లక్కినేని ఓబయ్య, హుస్సేన్ పీరా, వార్డ్ మెంబర్, ఓబయ్య, వెంకటసుబ్బయ్య, రమణ పాల్గొన్నారు.

గడువులోగా నాడు-నేడు పనులు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

మనబడి నాడు-నేడు కింద రెండవ దశలో జరుగుతున్న అభివృద్ధి పనులను పాఠశాలల పునఃప్రారంభం నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని జె.కొత్తపల్లిలో మనబడి నాడు-నేడు ద్వారా రూ.2.5 కోట్లతో నిర్మిస్తున్న 19 అదనపు తరగతి గదులను జెసి గణేష్ కుమార్, ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డిలతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1006 ప్రభుత్వ పాఠశాలు, అంగన్వాడీ సెంటర్ల తోపాటు జూనియర్ కాలేజీల్లో రూ.290 కోట్లతో మనబడి నాడు-నేడు రెండవ దశ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ పనులన్నింటినీ నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారుల పైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పాఠశాలలు పునఃప్రారంభం (జూన్ నెల 12వ తేదీ) నాటికి అన్ని పాఠశాలల్లో నాడు-నేడు పనులను పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మొన్న వచ్చిన ఎస్ఎస్‌సి ఫలితాలలో గవర్నమెంట్ స్కూల్ ఏపి స్కూల్లో ఎంతమంది హాజరయ్యారు? ఎంతమంది పాసయ్యారు ఎంత పర్సెంట్ వచ్చిందని అధికారులను అడిగి తెలుసుకుని జై కొత్తపల్లి హైస్కూల్లో 43 శాతం రావడం ఎందుకు ఇలా జరిగిందని సంబంధిత అధికారులను అడిగారు. ఇకనైనా బాధ్యతగా వచ్చే సంవత్సరానికి మంచి పర్సంటేజ్ సాధించేటట్లు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఇఒ రాఘవరెడ్డి, జిల్లా సమగ్ర శిక్ష పిఒ అంబవరం ప్రభాకర్‌రెడ్డి, ఎంఇఒ వెంకట్రామిరెడ్డి, తహశీల్దార్ గంగయ్య, ఎంపిడిఒ రవికుమార్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సురేష్ కుమార్ పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్

లోక్ అదాలత్‌లో 12,876 కేసుల పరిష్కారం

మాట్లాడుతున్న జిల్లా జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి

ప్రజాశక్తి-కడప

జాతీయ లోక్ అదాలత్‌లో 12,876 కేసులకు పరిష్కారం అభించిందని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రదీప్ కుమార్ తెలిపారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రూ.2.36 కోట్ల మొత్తాన్ని కక్షిదారులకు చెల్లించామని పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, లోక్ అదాలత్ సభ్యులు, కక్షిదారులు వారి వారి న్యాయవాదులతో సంప్రదింపులు జరిపి వారి వారి కేసులను పరిష్కరించుకున్నారని పేర్కొన్నారు. ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసినందుకు న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీసు అధికారులకు, వైద్య అధికారులకు, డిస్టిక్ పబ్లిక్ రిలేషన్ అధికారులకు, రవాణాశాఖ అధికారులకు, ఇన్సూరెన్స్ అధికారులకు, బ్యాంకు అధికారులకు, చిట్ ఫండ్ అధికారులకు, లేబర్ డిపార్ట్మెంట్ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్ఎన్ఎల్ వారికి, ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులకు, పత్రిక విలేకరులకు, ఆల్ ఇండియా రేడియో కడప వారికి, రవాణాశాఖ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వే శాఖ అధికారులకు, అడ్వకేట్ క్లర్కులకు, అగ్రికల్చరల్ అధికారులకు, మిగతా శాఖల అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 22 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సి.ఎస్.మూర్తి, నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గీతా, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ కవిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ప్రసూన, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ భార్గవి, బార్ ప్రెసిడెంట్ రాఘవరెడ్డి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు. లోక్‌అదాలత్ సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

'బడుల ప్రారంభం రోజే విద్యా కానుక కిట్లు'

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

ఈ విద్య సంవత్సరం పాఠశాలలు ప్రారంభించిన రోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక' మండల స్టాక్ పాయింట్‌ను కలెక్టర్ విజయ్‌రామరాజు, జెసి గణేష్ కుమార్, ఆర్‌డిఒ ధర్మచంద్రారెడ్డిలతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌లో ఉన్న టెక్స్ట్ బుక్స్, వర్క్ బుక్స్, డిక్షనరీస్ తోపాటు యూనిఫారం దుస్తుల నాణ్యత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నాణ్యమైన జగనన్న విద్యా కానుక కిట్లను పాఠశాలలు ఓపెన్ చేసిన మొదటి రోజే విద్యార్థులకు అందజేయాలని అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. 2023 -24 విద్యా సంవత్సరంకు సంబంధించి వైఎస్ఆర్ జిల్లా వ్యాప్తంగా 1,58,156 మంది విద్యార్థులకు జగనన్న విద్యా కానుక ద్వారా మూడు జతల యూనిఫామ్స్, రెండు జతల సాక్సులు, బ్యాగు, బెల్టు, టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, వర్క్ బుక్స్, డిక్షనరీస్ ఇవ్వనున్నట్లు, అందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు మండల స్థాయిలో మండల విద్యాశాఖ అధికారులు మరియు సంబంధిత తహశీల్దార్లకు, ఎంపిడిఒలను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి, జిల్లా సమగ్ర శిక్ష పిఒ ప్రభాకర్‌రెడ్డి, తహశీల్దార్ గంగయ్య, ఎంపిడిఒ రవికుమార్‌రెడ్డి, ఎంఇఒ వెంకట్రామిరెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు మిట్ట కేశవరెడ్డి, కొండా దశరథరామిరెడ్డి, సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

రైతులకు చుక్కలు చూపిస్తున్న ప్రభుత్వం : టిడిపి

ప్రజాశక్తి-కడప అర్బన్

చుక్కల భూముల రైతులకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తోందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ విమర్శించారు. శనివారం పాత బస్టాండ్‌లోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుక్కలు భూములు 22 ఎ జాబితాలో చేర్చింది అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఫలితంగా రాష్ట్రంలో కొన్ని లక్షల మంది సన్న, చిన్న కారు రైతులు ఇబ్బంది పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. చుక్కల భూములు రైతులు దాదాపు 18 లక్షల మంది కోర్టుకు పోయి ఇబ్బందులు పడ్డారని, వారి కష్టాలను గమంచి టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు పేద రైతు ఇబ్బంది పడకూడదు అని 2017 చుక్కల భూములు చట్టం తెచ్చరన్నారు. ఈ చట్టం ద్వారా 12 సంవత్సరాలు అనుభవంతో ఉన్న రైతులు మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి న్యాయం చేయాలని టిడిపి ప్రభుత్వం అధికారుల మీద ఒత్తిడి తెచ్చి తాసిల్దార్ నుంచి ఆర్డీవో ద్వారా కలెక్టర్ ఆఫీస్‌కు పరిష్కారం కోసం పంపిచ్చామన్నారు.ప్రభుత్వంలో సంబంధిత అధికారులు రైతులకు లేని పోనీ సందేహాలు స ృష్టిస్తూ ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. ఈ చట్టాన్ని వ్యాపారంగా చేసుకుని రైతులకు చుక్కలు చూపిస్తున్నారన్నారు. ఇప్పటికైనా తహశీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లో పెండింగ్ ఉన్న రైతుల ఫైల్లు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో మైనారిటీ నాయకులు నాదిండ్ల దస్తగిరి, రూపానగుడి హుస్సేన్, ఖాదర్ సాబ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మన్నూరు అక్బర్

శాశ్వత పరిష్కారంపై హర్షం

ప్రజాశక్తి-కడప

లక్ష మంది రైతులకు రూ.20 వేల కోట్ల లబ్ది చేకూర్చేలా చుక్కల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన సిఎం జగన్ మోహనరెడ్డికి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. శనివారం ఆయన ఆయన మాట్లాడుతూ చుక్కల భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో తగిన మార్పులు చేసి రైతులకు సర్వ హక్కులు కల్పించడం సంతోషదాయకమన్నారు. తరతరాలుగా సాగు చేస్తున్నా రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు జరగని అధ్వాన్నమైన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. రైతన్నల పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే పరిష్కారం చూపాల్సిన చంద్రబాబు ప్రభుత్వం 2016లో పుండుమీద కారం చల్లినట్లుగా రిజిస్ట్రేషన్లు నిలిపివేసిందన్నారు.

కంటితుడుపే!

ప్రజాదృష్టి

మట్టి అక్రమ రవాణా నిలిపివేత కంటితుడుపు చర్యకు పరిమితమైంది. జిల్లాలో కడప, జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్లలో పలు చెరువుల నుంచి మట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిన సంగతి తెలిసిందే. కడప డివిజన్ పరిధిలోని వ్యవసాయం పేరుతో సుమారు నాలుగు చెరువుల నుంచి అనుమతులు తీసుకుని వాణిజ్య కార్యకలా పాలకు పెద్దఎత్తున తరలించడంపై విమర్శల వర్షం కురిసింది. జిల్లా కార్యనిర్వాహకవర్గం మట్టి అక్రమ రవాణా నివారణపై ఉద్దేశపూర్వ కంగానే మీనమేషాలు లెక్కించిందనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. కడప పట్టణానికి సమీపంలోని చెర్లోపల్లి గ్రామస్తులు తమ చెరువు నుంచి మట్టి అక్రమ తరలింపును నిలువరించాలని కోరుతూ అధికారులకు పలుమార్లు మొరపెట్టుకుంది. జిల్లా ఉన్నతాధికారులు ఉద్దేశపూర్వకంగా విస్మరించడాన్ని నిరసిస్తూ హైకోర్టును ఆశ్రయిం చాల్సిన దుస్థితి దాపురించింది. హైకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ మట్టి అక్రమ రవాణాను నిరోధించకపోవడం విస్మయాన్ని కలిగించింది. మట్టి అక్రమ తరలింపు వ్యవహారంలో జిల్లా అధికారులపై రాజకీయ ప్రభావాన్ని తేటతెల్లం చేసిందనే విమర్శ వినిపిస్తోంది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం మట్టి అక్రమ రవాణాదారులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. కేవలం కంటితుడుపు చర్యగా అక్రమ రవాణా నిలుపు దల వరకే పరిమితం కావడం గమనార్హం. జిల్లా ఉన్నతాధికారులు మట్టి తరలింపునకు అక్రమార్కులకు ఇచ్చిన అనుమతి ఎంత, తరలింపు పరిమాణం ఎంత, ఏయే కొలతల మేర ఏయే చెరువుల్లో గుంతలు తవ్వారనే కోణంలో విచారించాల్సిన అవసరం ఉంది. ఇటువంటి చర్యలు తీసుకోవడాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరించడం గమనార్హం. జిల్లా ఉన్నతాధికారుల తీరును గమనిస్తే మట్టి అక్రమార్కులకు ఉద్దేశపూర్వకంగా వంతపాడుతున్నారా అనే సందేహం కలిగిస్తోంది. రాజకీయ నాయకుల ఆధిపత్యానికి తమ విద్యుక్త ధర్మాన్ని తాకట్టు పెట్టారా, రాజకీయానికి తలవంచారా అనే ఆలోచనను కలి గించడం విస్మయాన్ని కలిగిస్తోంది. తమ విధులను సక్రమంగా నిర్వ ర్తించాల్సిన ఉన్నతాధికారులు మట్టి అక్రమ రవాణా ఉల్లంఘనల నేపథ్యంలో మట్టి అక్రమార్కులపై ఎటువంటి విచారణ చేపట్టకపోవడం విస్మయాన్ని కలిగించింది. అక్రమార్కుల నుంచి కొల్లగొట్టిన మట్టి పరిమాణాన్ని లెక్కించాలి. అనంతరం కొల్లగొట్టిన మట్టి పరిమాణాన్ని గణించి, వాణిజ్య కార్యకలాపాల ద్వారా అక్రమార్కులు సాధించిన ఆర్జన విలువ ఎంతో విశ్లేషించి ఆమేరకు జరిమానాలు వసూలు చేయాల్సిన అవసరం ఉంది. ఇటువంటి చర్యలను అమలు చేసిన నేపథ్యంలో భవిష్యత్‌లో అక్రమార్కులు బరితెగింపునకు కత్తెరపడే అవకాశం ఉంటుందని చెప్పవచ్చు. ఏదేమైనా జిల్లా నీటిపారుదల, రెవెన్యూ యంత్రాంగాలు తన విధులను సక్రమంగా నిర్వహించ డంలో విఫలం కావడం వెనక ఉన్న మతలబేమిటో వెల్లడి కావాల్సిన అవసరం ఉంది.

- ప్రజాశక్తి - కడపప్రతినిధి

కంపచెట్లు తొలగించక ముందు, తొలగించిన తర్వాత విశాలమైన రోడ్డు

కంప చెట్ల తొలగింపు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక రైల్వేస్టేషన్ వెళ్లే దారిలో ఏపుగా పెరిగి రోడ్డును అల్లుకుంటున్న కంప చెట్లను శనివారం అధికారులు తొలగించారు. ఈనెల 11న 'ప్రజాశక్తి' దినపత్రికలో 'దారిని అల్లుకుంటున్న కంపచెట్లు' శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. దారిని కమ్మేస్తున్న కంపచెట్లను తొలగించి, శుభ్రం చేశారు. దీంతో ప్రయాణికులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఐటిఐలో ప్రవేశాలు ప్రారంభం

ప్రజాశక్తి - ముద్దనూరు

స్థానిక గజ్జల చిన్న రంగారెడ్డి మెమోరియల్ ప్రైవేటు ఐటిఐలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ సుబ్బారావు తెలిపారు. ఆ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ ఐటిఐలో డీజల్ మెకానిక్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ కోర్సులు ఉన్నాయన్నారు. ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉపకారవేతనాలు, ఉచిత హాస్టల్ సౌకర్యం ఉందన్నారు. అప్రెంటిస్ సౌకర్యం ఉంటుందన్నారు. మూడు నెలలకు ఒకసారి వివిధ కంపెనీలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు ఆయన వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

సదాశివరాయలు కాలంనాటి బావి గుర్తింపు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మండలం తిప్పిరెడ్డిపల్లె ఎర్ర చెరువుకు సమీపంలోని పుట్టక కనుమ దిగువ భాగం పడమర వైపున సదాశివరాయలు కాలం నాటి

బావిని గుర్తించినట్లు రచయిత, చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ శనివారం విలేకరులకు తెలిపారు. తిప్పిరెడ్డిపల్లె ఎర్ర చెరువు గుండా ఒకకిలోమీటర్ మైలు దూరం ప్రయాణించిన ఈ బావిని కనుగొన్నట్లు తెలిపారు. పెద్దవంక, ఆ వంకకు ఒక పిల్ల వంక కలిసే ప్రాంతానికి పడమర వైపు ఈ బావి ఉందని.. ఆ బావికి వీర బావడ బావి పేరు అని ఆయన వివరించారు. వీర బావడ బావికి పడమర వైపు అత్యంత సుందరమైన పార్వతీదేవి విగ్రహం ఉండేదని, గతంలో ఆ విగ్రహాన్ని చూసిన తిప్పిరెడ్డిపల్లె వాసి నడిపి వెంకటయ్య తనకు చెప్పారని రమేష్ తెలిపారు. ప్రస్తుతం ఆ విగ్రహాన్ని గుర్తించలేకపోయామన్నారు. ఎర్ర బరక ప్రాంతంలోని వీర బావడా బావికి ఎడమవైపున ఆనాటి నివాస గృహాల గోడల ఆనవాళ్లు ఇప్పటికీ ఉన్నాయని చరిత్రకారుడు చెప్పారు. ఈ గోడలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయని వివరించారు. ఎర్రబరక ప్రాంతం ప్రస్తుతం ముళ్లచెట్లతో దట్టంగా అల్లుకుని ఉన్నందున ప్రయాణించడానికి వీలు లేకుండా ఉందన్నారు. తిప్పిరెడ్డిపల్లె వాసులు నడిపి సుబ్బరాయుడు, యాపరాల చెంద్రాయుడు, ముదిరెడ్డిపల్లె సుబ్బారెడ్డి అందించిన సమాచారంతో అక్కడికి అత్యంత కష్టంగా చేరుకొని బావి నివాస గృహాల గోడల ఆనవాళ్లు భారత పురావస్తు పరిశోధన శాఖ డైరెక్టర్ మునిరత్నంరెడ్డికి ఛాయాచిత్రాలను వాట్సప్ ద్వారా పంపించగా ఆయన పరిశీలించి ఇవి సదాశివరాయల కాలం నాటివని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం 8.30గంటల నుంచి 11వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్ శాఖ జెఇ శివ తెలిపారు. ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు చేస్తున్నందున తాళ్లపల్లె, గిడ్డంగివారిపల్లె, రామిరెడ్డిపల్లె, అయ్యవారిపల్లె గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. రైతులు, వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

గుంతకు మరమ్మతులు చేయండి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

పట్టణంలోని కాపు వీధి, ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా సందులో కాలువపై సిమెంటు దిమ్మె దెబ్బతిని ప్రమాదకరంగా ఏర్పడిందని, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. శనివారం దెబ్బతిన్న కాలువ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. విద్యా సంస్థలకు కూడా ఇదారిని వెళ్లాల్సి ఉందన్నారు. కాలువపై సిమెంటు దిమ్మె దెబ్బ తిని గుంత ఏర్పడి చాలా రోజులైందన్నారు. ప్రజలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నాయన్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని యువజన సంఘం నాయకులు కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు ప్రసాద్, మన్సూర్ పాల్గొన్నారు.

జిఒ-1 రద్దుపై సిపిఎం హర్షం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు జిఒ నంబర్ వన్ రద్దుపై సిపిఎం హర్షం వ్యక్తం చేస్తున్నట్లు సిపిఎం జమ్మలమడుగు కార్యదర్శి వీరనాల శివనారాయణ తెలిపారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇది ప్రజాస్వామ్య విజయమన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం జిఒ నంబర్ వన్‌ను తెచ్చిందన్నారు. జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన పాదయాత్రలు, పోరాటాలు, ఆందోళనలు ఇలాంటి చీకటి జిఒ ఉంటే జరిగేవా అని ఆయన ప్రశ్నించారు. అంతిమంగా ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరి మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో కొండయ్య, పల్లా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వీరనాల శివనారాయణ

భూములు కోల్పోయిన రైతుల వివరాలు అందజేయాలి

ప్రజాశక్తి - చాపాడు

బెంగళూరు-విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకి భూములు కోల్పోయిన రైతుల వివరాలు వెంటనే అందజేయాలని తహశీల్దార్ సుభాని తెలిపారు. మండలంలో అనంతపురం, కుచ్చుపాప, అల్లాడుపల్లె, కేశవరం, ఖాదర్‌పల్లె, సోమాపురం, పిచ్చపాడు వెదుర్ల గ్రామాల పరిధిలో రైతులు భూములు కోల్పోతున్నారన్నారు. రైతులకు నష్టపరిహారంగా మండలానికి రూ.30 కోట్లు బడ్జెట్ మంజూరైందన్నారు. అన్ని రకాల రికార్డులు అందించిన రైతులకు కొంతమందికి నష్టపరిహారం కూడా వారి ఖాతాలో జమ చేశారన్నారు. పత్రాలు ఇవ్వని రైతులు వెంటనే సంబంధిత వివరాలతో అందజేయాలని ఆయన సూచించారు.

అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలో బాలిక, యువతి అదృశ్యమైనట్లు శనివారం సిఐ నరేష్‌బాబు తెలిపారు. సిఐ తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని ఓ కాలనీకి చెందిన బాలిక (17) పది చదివి ఇంటి వద్ద ఉంటోంది. శుక్రవారం మధ్యాహ్నం అంగడికని వెళ్లింది. తిరిగి రాక పోవడంతో చుట్టూ పక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. శనివారం బాలిక తల్లి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే మండలానికి చెందిన యువతి (19) జమ్మలమడుగులో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతుంది. శుక్రవారం వేకువ జామున ఉదయం ఇంటి నుంచి వెళ్లి రాకపోవడంతో ఆ యువతి తల్లి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

వంద పడకల ఆస్పత్రి నిర్మాణం ఎక్కడ..?

తీరని స్థలం సమస్య - మాట నిలుపుకోవడంలో నాయకులు, అధికారుల వైఫల్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రి వంద పడకల హామీ.. కేవలం మాటలకే పరిమితమైంది. గత ప్రభుత్వ హయాంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆస్పత్రిగా ప్రభుత్వం మంజూరు చేసినట్లు అప్పటి ప్రభుత్వ ఆసుపత్రి చైర్మన్ మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డి తనయుడు సుధీర్‌రెడ్డి ప్రకటించారు. అయితే సార్వత్రిక ఎన్నికలు రావడంతో వంద పడకల హామీ జమ్మలమడుగు ప్రజలకు కలగానే మిగిలిపోయింది. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం ప్రతిరోజు రోగులు పెద్ద సంఖ్యలో వస్తూ ఉంటారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు కొరత ఉంది. ఈ పరిస్థితుల్లో రోగులు ఇతర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులకు వెళుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రి భవనాలను సైతం నూతనంగా నిర్మించారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రికి కావాల్సిన ఫర్నిచర్, వైద్య పరికరాలు, నీటి సదుపాయం, మందుల లభ్యత ఉండేది. జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రతి నెలలో రెండు, మూడు మార్లు ప్రభుత్వాసుపత్రిని సందర్శిస్తూ రోగులను పరామర్శిస్తూ ఉంటారు. జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేయాలనే తపన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి ఉన్నా ప్రభుత్వం డాక్టర్లను పూర్తిస్థాయిలో భర్తీ చేయలేక పోతుంది. ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లా వాసి కావడంతో జమ్మలమడుగులోని ప్రభుత్వ ఆస్పత్రి వంద పడకల ఆసుపత్రి కోసం కొత్త జిఒ విడుదల చేసినట్లు తెలుస్తోంది. కానీ ప్రభుత్వ ఆసుపత్రికి స్థలం కేటాయించడంలో జాప్యం జరుగుతుండడంతో వైద్యాధికారులు వైఫల్యం స్పష్టంగా కనబడుతోంది. వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి స్థలం సమస్యపై ప్రభుత్వ ఉన్నతాధికారులు పలుమార్లు చర్చించినప్పటికీ పరిష్కారం చూపడంలో వైఫల్యం చెందు తున్నారు. నాబార్డ్ నిధులు ద్వారా ప్రస్తుతం సుమారు రూ.12 కోట్లు నిధులు కూడా సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి డాక్టర్ వృత్తిలో ఉండడంతో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రి మరింత అభివృద్ధి చెందుతుందని, రోగులకు మెరుగైన వసతులు ఏర్పాటవుతాయని ప్రజలు భావించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ స్థలం కేటాయింపులో జాప్యం జరుగుతోంది. జమ్మలమడుగు పరిసర ప్రాంత రోగులకు అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందక ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో కర్నూల్, కడప, తిరుపతి ప్రాంతాలకు వైద్యం కోసం వెళుతున్నారు. వంద పడకల ఆసుపత్రిగా జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆస్పత్రిగా మారిస్తే రోగులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జమ్మలమడుగుపై ప్రత్యేకదృష్టి సారించి జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు సూచిస్తున్నారు.

విద్యుదాఘాతంతో బేకరి దగ్ధం

రూ.30 లక్షలు నష్టం.. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల వేడుకోలు

ప్రజాశక్తి - చెన్నూరు

కడప-కర్నూలు జాతీయ రహదారిపై చెన్నూరు కొత్తరోడ్డు పక్కన ఉన్న బేకరి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో దాదాపు రూ.30లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. చెన్నూరుకు చెందిన కుందేటి బాబు (ముద్దుల బాబు) అనే వ్యక్తి జాతీయ రహదారి పక్కన స్వీట్ అండ్ బేకరి షాపు నడుపుచున్నాడు. రోజులాగే శుక్రవారం రాత్రి 10 గంటల తర్వాత అంగడి మూసేసి ఇంటికెళ్లాడు. అర్ధరాత్రి గంటల తర్వాత దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం, యంత్రాలు, స్వీట్లు, పలు సమాన్లు పూర్తిగా కాలిపోయాయి. వాటితోపాటు కుమార్తె పెళ్లి కోసం తెచ్చుకున్న రూ.10 లక్షల నగదు, పట్టాదారు భూమి పాస్ పుస్తకాలు, వ్యవసాయ పొలానికి సంబంధించిన దస్తావేజులు పూర్తిగా కాలిపోయాయని బాధితుడు తెలిపాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు మంటలను అదుపు చేసి, ఇతర షాపులకు వ్యాపించకుండా నియంత్రించారు. పక్కన ఉన్న గౌరీ హోటల్‌కు కొద్దిగా మంటలు వ్యాపించి ఫర్నిచర్ కాలిపోయాయని యజమాని ఓబులేస్ తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు. హోటల్ యజమాని ఓబులేసు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సంఘటన స్థలాన్ని ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్ సందర్శించి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం నుండి సహాయ అందేలా చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రమాదంలో కాలిపోయిన యంత్రాలు, స్వీట్లు, పరికరాలు

సిఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి - ఖాజీపేట

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మైదుకూరు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని జగన్ నెరవేర్చారని శనివారం ఆయన మండలంలోని తిమ్మారెడ్డిపల్లె దళితవాడలో తెలిపారు. గ్రామంలో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికెళ్లి వైసిపి ప్రభుత్వంలో చేకూరిన లబ్ధి, ఆర్థిక ప్రయోజనాలను వివరించారు. సమస్యలను ప్రజలనడిగి తెలుసుకున్నారు. జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఒక్క తుడుమలదినెన్న, తిమ్మారెడ్డిపల్లెలో రూ.9కోట్లు 40లక్షల14వేల 4వందల 91ఆర్థిక లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు అచ్చుకట్ల కరీముల్లా, గ్రామ సర్పంచు కృష్ణారెడ్డి, పుల్లూరు వైసిపి నాయకుడు మాజీ సర్పంచు ఇరగంరెడ్డి నాగేశ్వర్‌రెడ్డి, ఉప మండల అధ్యక్షుడు దుగ్గిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మండల కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్‌రెడ్డి, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షులు పివి రాఘవరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

కుట్రలు, కుతంత్రాలకు బెదరం

- టిడిపి హయాంలో అభివృద్ధి శూన్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- జమ్మలమడుగు

ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా బెదిరేది లేదని, వచ్చే ఎన్నికల్లోనూ వైసిపి అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని పొన్నతోట పంచాయతీలో నర్సోజు కొట్టాల గ్రామంలో శనివారం పార్టీ నాయకులతో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసం ఉందన్నారు. 2014 నుంచి 2019 వరకు టిడిపి అధికారంలో ఉందని, బిజెపి, జనసేన మద్దతుగా ఉన్నాయన్నారు. ప్రజలు అధికారమిస్తే అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జగన్ నాయకత్వం వైపు ప్రజలు ఉన్నారని ప్రతిపక్ష పార్టీలు గ్రహించి కుట్రలు చేసి అధికారంలోకి రావాలని యత్నిస్తున్నాయని తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిపై ప్రతిపక్ష పార్టీలకు చిత్తశుద్ధి లేదన్నారు. కేవలం సిఎం సీటుపైనే వాళ్ల ధ్యాసంతా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు నారాయణ, వైసిపి నాయకులు బాలయ్య, బాలరాజు, ప్రసాద్, హనుమంత్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

కర్ణాటకలో కాంగ్రెస్ విజయంపై సంబరాలు

కడప : సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

ప్రజాశక్తి-కడప

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో నగరంలో ఆ పార్టీ నగర అధ్యక్షులు వై.విష్ణుప్రీతంరెడ్డి ఆధ్వర్యంలో శనివారం సంబరాలు నిర్వహించుకున్నారు. డిసిసి కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి చార్లెస్, నాయకులు లక్ష్మయ్య, జార్జ్ లూయిస్, పుల్లయ్య, కుళ్లాయప్ప, బాబు, సుబ్బారెడ్డి, శ్రీహరి, లావణ్య పాల్గొన్నారు. **ఎపిలోనూ విజయం సాధిస్తాం:** కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగరవేయడం శుభపరిణామని ఎఐసిసి సభ్యులు బండి జకరయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బండి సుమంత్ కుమార్ అన్నారు. కర్ణాటకలో విజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీకి దేశంలో మంచి రోజులు మొదలయ్యాయన్నారు. డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బిజెపి ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, మతోన్మాద చర్యలు చేసినా అధికార దుర్వినియోగం చేసి మంచినీళ్ల ప్రాయంగా డబ్బు ఖర్చుపెట్టినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. సమావేశంలో నాయకులు తిరుమలేష్, అయ్యవారయ్య, కదిరి ప్రసాద్, లేబర్ పాల్గొన్నారు. **మోడీపై రాహుల్ గాంధీ గెలుపు :** కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 136 అసెంబ్లీ స్థానాల్లో భారీ విజయం దక్కించుకోవడం కాంగ్రెస్ పార్టీ రథసారథి రాహుల్ గాంధీ నాయకత్వంపై ప్రజల విశ్వాసం తెలియజేస్తుందని డిసిసి మాజీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్ అలీఖాన్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ విజయం సాధించడంపై స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోస్మహిద్దీన్, ఆసిఫ్ ఖాన్, శ్రీనివాసులు, ఖాదర్‌ఖాన్, ఆరిఫ్, సంఘ సేవకుడు సలావుద్దీన్, ఆరిఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల టౌన్: కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి, ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అన్వర్ అన్నారు. బాణసంచా కాల్చి, కేక్ కట్ చేసి విజయోత్సవ సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుడిగి శ్రీను, మహబూబ్ బాషా, యూత్ కాంగ్రెస్ నాయకులు సలీం, ముజాహిద్, సోహెల్, రఫి పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆ పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కడప జిల్లా మీడియా చైర్మన్ జానకి రామకృష్ణ మాట్లాడుతూ కర్ణాటక శాసనసభ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీకి ఘన విజయాన్ని అందించిన కర్ణాటక ప్రజలకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఫలితాలు కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో అటు కేంద్రం,ఇటు రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ తప్పక అధికారంలోకి వస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్య శర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబయ్య, మండల అధ్యక్షుడు జయరామిరెడ్డి, పుష్పరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **వేంపల్లె :** కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుతో దేశ రాజకీయాల్లో కీలక మలుపు తిరుగుతుందని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల శనివారం పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ కర్ణాటక ఫలితాల ప్రభావం తెలుగు రాష్ట్రాల్లో గణనీయంగా పడుతుందన్నారు. ఈ ఏడాదిలో జరగబోయే రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్, తెలంగాణ రాష్ట్రాలపై కర్ణాటక ఫలితాలు ప్రభావం ఉంటుందని తెలిపారు. వచ్చే ఏడాదిలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల మీద, ఆంధ్రప్రదేశ్ మీద కూడా తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఇటు రాష్ట్రంలో ఇటు దేశంలో పూర్వ వైభవం వస్తాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, ఉత్తన్న, అమర్, సుబ్బరాయుడు, శివ, బద్రి, వెంకటేష్, నాగార్జున పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించిన సందర్భంగా శనివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయం సమీపంలో పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ ఇన్‌ఛార్జి నజీర్ మాట్లాడుతూ మతతత్వ పార్టీ బిజెపిని మట్టికరిపించడం సంతోషకరమన్నారు. కర్నాటక ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే 2024 ఎన్నికల్లో కూడా ఆంధ్రరాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ యువనేత రాహుల్‌గాంధీ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జీలాన్‌బాషా, మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్‌రఫీ, భాస్కర్ పాల్గొన్నారు.

'అమ్మను మించిన దైవమున్నదా'

- నేడు మాతృమూర్తి దినోత్సవం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

తులసీభాగ్యలక్ష్మి

క్షమాగుణంలోనూ, సేవాగుణంలోనూ అమ్మకు సాటిగా నిలిచే వ్యక్తి ఈ భూమ్మీద ఎవరూ ఉండరు. అమ్మకు అమ్మేసాటి. బాల్యంలో తెలియక చేసే తప్పులను క్షమించి అక్కున చేర్చుకుంటుంది. యవ్వనంలో మిడిమిడి జ్ఞానంతో చేసే పొరపాట్లను శాంతంగా నచ్చచెబుతుంది. వయసొచ్చాక తప్పులు చేస్తే నవ్వి మార్చమని భగవంతుడిని వేడుకుంటుంది. అందుకే అమృతం ఎలా ఉంటుందో తెలియదు.. కాని అమ్మప్రేమ అంతకన్న తియ్యనైందటారు. భగవంతుడు అన్ని చోట్ల ఉండలేక అమ్మను సృష్టించాడంటాడో కవి. ప్రతి సంవత్సరం మే రెండవ ఆదివారం మాతృమూర్తి దినోత్సవం జరుగుకుంటున్నాం. అమ్మసేవలన గుర్తు చేసుకోవడం కోసం ఒక రోజంటూ ఏర్పడడం నిజంగా హర్షించతగ్గ విషయం. అదే సమయంలో దీన్ని ఒకరోజుకే పరిమితి చేయడం సమంజసం కాదు. స్త్రీలకు అంతటా సమప్రాధాన్యం దక్కిన రోజు హింస నుండి వారిని విముక్తి చేయబడ్డరోజు, భ్రూణహత్యల బారినుండి ఆడ శిశువులను రక్షించిన రోజు ప్రపంచానికి మరింత మంది గొప్ప అమ్మలను అందించగలం. ముఖ్యంగా పితృస్వామ్య భావజాలాన్ని విడనాడి స్త్రీ, పురుష సమానత్వం సాధించిన రోజు అమ్మలకు నిజమైన గౌరవాన్ని ఇచ్చినట్లు. అమ్మ ప్రేమకు కొలమానాలు లేవు. అమ్మప్రేమను వివరించేందుకు అక్షరాలూ లేవు. మనమీస్థాయిలో ఉండేందుకు కారణమైన అమ్మను ఎంత ప్రేమగా చూసుకున్నా తక్కువే. అమ్మప్రేమను సమాజానికంతటికీ అందిద్దాం. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు వాసి తులసీభాగ్యలక్ష్మి మాటల్లోనే 'నాకు ముగ్గురు అమ్మాయిలు, ఒక అబ్బాయి. చిన్నతనంలోనే అనారోగ్యంతో భర్తను కోల్పోయాను. అప్పట్లో ఈ నలుగురు సంతానం, పేదరికం తప్ప నావద్ద ఏమీలేవు. పంటి బిగువున కష్టాలను దాచిపెట్టి ఆడబిడ్డలకు వివాహాలు చేశాను. అనారోగ్యంతో మృత్యువు అంచువరకు వెళ్లిన మా అబ్బాయిని దక్కించుకొని ప్రయోజకుణ్ని చేశాను. ఏమైనా చేసి అమ్మ పిల్లల్ని సాకుతుంది. పిల్లల కోసం ప్రాణం సైతం లెక్కచేయదు. తల్లిదండ్రులు పిల్లలకు తరగని ఆస్తి. వృద్ధాప్యంలో తల్లిదండ్రుల పోషణ భారం కాదు బాధ్యత'గా భావించాలని అన్నారు.

సామాన్యులు బతకలేని పరిస్థితులు : టిడిపి

ప్రజాశక్తి - కొండాపురం

వైసిపి ప్రభుత్వంలో సామాన్యులు బతకలేని పరిస్థితులు నెలకొన్నాయని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పాత కొండాపురం కాలనీ నుంచి శనివారం ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక నాయకులు చామల విష్ణువర్ధన్‌రెడ్డి ఘనస్వాగతం పలికారు. కాలనీలోని గ్రామదేవత పెద్దమ్మ తల్లికి పూజలు నిర్వహించి, ప్రతి ఇంటికి వెళ్లి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను భూపేష్‌రెడ్డి వివరించారు. గండికోట ముంపువాసులు పడుతున్న కష్టాలు తెలిసి కూడా ప్రభుత్వ పెద్దలు మొద్దు నిద్ర నటిస్తున్నారని విమర్శించారు. సొంత జిల్లా వాసి ముఖ్యమంత్రి అయినా ఒరిగింది ఏమీలేదన్నారు. గత ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను విస్మరించడం బాధాకరమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రి, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు సిఎం ఇందిరమ్మ, కొండాపురం మండలం మహిళా అధ్యక్షురాలు చామల పద్మజ, సిఎం సురేష్‌రెడ్డి, చామల శ్రీనివాసులురెడ్డి, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాచమార్గం : జడ్జి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

లోక్ అదాలత్ ద్వారా రాజీమార్గంలో కేసులు పరిష్కారం చేయడం జరుగుతుందని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా జడ్జి భార్గవి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్క రించుకోవడంలో చక్కటి మార్గం జాతీయ లోక్ అదాలత్ అన్నారు. మొత్తం అన్ని రకాల కేసులు కలిపి 1151 కేసుల్లో రూ.13 లక్షల 44,542 సెటిల్మెంట్ చేయడం జరిగిందన్నారు. మధ్యాహ్నం కోర్ట్ ఆవరణలోనే అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో డిఎస్‌పి నాగరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సి.నారాయణరెడ్డి, మురళీధర్‌రెడ్డి, జమ్మలమడుగు సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుల్స్, కోర్టు సిబ్బంది, బార్ అసోసియేషన్ సభ్యులు, కక్షిదారులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు అభివృద్ధి పథకాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులో తలపెట్టిన అన్ని అభివృద్ధి పథకాలు త్వరలో ప్రజల ముంగిటికి రాబోతున్నాయని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి అన్నారు. నిర్మాణదశలో ఉన్న పలు అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రూ.120కోట్లతో అమృత్ పథకాన్ని పూర్తి చేశామని త్వరలో ప్రతిరోజు ప్రతి ఇంటికి నీరు అందజేస్తామన్నారు. కాలువల ఆధునీకరణకు అవసరమైన సాంకేతిక పనులు పూర్తయ్యాయని తెలిపారు. రూ.160కోట్లతో పూర్తి చేయనున్న ఈ పథకాన్ని ఈ నెల 21న పనులు ప్రారంభిస్తామన్నారు. ఒకటిన్నర సంవత్సర కాలంలో ఈ పనులను పూర్తి చేస్తామన్నారు. ధర్మల్ దారిలో రూ.53కోట్లతో నిర్మాణ దశలో ఉన్న పనులను రాబోయే సంవత్సరం మార్చి, ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామన్నారు. రూ.5కోట్లతో నిర్మాణదశలో ఉన్న ఆర్‌టిసి బస్టాండ్ ఆధునీకరణ పనులు సెప్టెంబర్‌కు పూర్తి చేస్తామన్నారు. రూ.53కోట్లతో నిర్మాణం ప్రారంభించిన నూతనకూరగాయల మార్కెట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రానున్న ఏడాదిలో ఎన్నికలు రాబోతున్నాయని, అధికార, పార్టీ ప్రతిపక్ష పార్టీలు ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాలని రాచమల్లు ప్రసాదరెడ్డి కోరారు.

పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

హనుమజ్జయంతికి ఏర్పాట్లు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని విశ్వనాథపురం, తిప్పిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆది, సోమవారాల్లో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం పూజలు, అన్నదానం ఏర్పాటు చేశారు. తిప్పిరెడ్డిపల్లెలో గతంలో ఉన్న చిన్నపాటి గుడిని ప్రస్తుతం విస్తరించి నూతన గుడిని నిర్మించారు. గుడి నిర్మాణానికి రూ.6 లక్షలు సీతంపల్లె గ్రామానికి చెందిన తడిసిరి లక్ష్మమయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మురళీమోహన్ యాదవ్, జ్యోత్స్న దంపతులు అందజేశారు. హనుమజ్జయంతి సందర్భంగా కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన, చెక్కభజన వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. విశ్వనాథపురంలో సోమవారం బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కంటి వ్యాధుల పట్ల అవగాహన ఉండాలి

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

ప్రతి ఒక్కరూ కంటి వ్యాధులు పట్ల అవగాహన కలిగి ఉంటే తమ చూపును పదిలంగా భద్రపరచుకోవచ్చని కంటి వైద్యుడు యం.ఎస్.తేజ అన్నారు. జనవిజ్ఞాన వేదిక (జెవివి) సమ్మర్ క్యాంప్‌లో భాగంగా శనివారం సెక్రటేరియట్ సభ్యులు రాజేష్ ఆధ్వర్యంలో పిల్లలకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వానికి గల కారణాలను, దృష్టి లోపాలపై అవగాహన కల్పించారు. పాలకూర, క్యాబేజి, బీట్రూట్, చేపలు, విత్తనాలు, బీన్స్, గింజలు, గుడ్లు, నిమ్మ, నారింజ వంటి సిట్రస్ పండ్లలో కళ్లకు శక్తినిచ్చే విటమిన్ ఎ, సి, ఇ ఉంటాయన్నారు. అవసరమైతే కళ్లజోడు ధరించాలని, ప్రతిరోజు 8గంటల నిద్ర అవసరమన్నారు. ఏడాదికోసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, ఆరోగ్య విభాగం జిల్లా కన్వీనర్ డాక్టర్ చక్రధర్, ప్రధాన కార్యదర్శి సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు